


# సాహసం

కప్పగంతుల మల్లికార్జునరావు

"**చివరి సారిగా** చెబుతున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అంది సుబ్బలక్ష్మి ఆవేశంగా.

"నన్నే కాదు. నిన్ను తప్ప నువ్వు మరెవర్నీ ప్రేమించలేవు." షేవింగ్ క్రీమ్ బ్రష్ చేసిన మొహాన్ని అద్దంలో చూసుకుంటూ రామారావు చాలా సహజంగా అన్నాడు.

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. పోనీ అదైనా ఇష్ట పడతావా?"

"నా పెళ్ళి విషయం మా పెద్దలు నిర్ణయిస్తారు. మీ వాళ్ళను మా వాళ్ళతో..." అతను వాక్యాన్ని పూర్తి చేయక మునుపే చెంప సర్రుమని కోసుకుంది. అతని కుడి చేతిలోని రేజర్, ఎడం చేతిలోని అద్దం—రెండూ ఆమె చేతుల్లో ఉన్నాయి.

కోపంతో సుబ్బలక్ష్మి కళ్ళు గాస్ పొయ్యిలా మండుతున్నాయి. కావడి కుండల్లా ఆమె గుండె ఆవేశంతో పైకీ కిందికీ ఎగిరెగిరి పడుతూంది.

ఆ రూపంలో సుబ్బలక్ష్మి అతని కళ్ళకు అందంగానే కనిపించింది. కానీ అందాన్ని ఆస్వాదించే సమయమా అది?

అతని చెంప మండుతూంది. రక్తం ఎంత కారుతున్నదో చూసుకుందామన్నా అద్దం లేదు. టర్కీ టవల్‌ను చెంప కయివ గంటుకి అడ్డంగానొక్కిపట్టి కిటికీలో గుండా కొబ్బరిచెట్టు మట్టల్ని చూస్తున్నాడు.

"నీ పెళ్ళి నిర్ణయించడానికి మీ అమ్మ నాన్నలెవరు? నాకు తెలీదనుకోకు నీ ప్లాన్? అమ్మానాన్నలకు వదిలేస్తే ఎంచక్కా పెళ్ళిచూపులు... కట్నాలు...లాంఛనాలు...ఇవన్నీ కొట్టేయ వచ్చని ఆశ. నాకు కట్నాలు ఇచ్చే వాళ్ళన్నా పుచ్చుకునే వాళ్ళన్నా అసహ్యం. నేను నీకు కట్నం ఇవ్వను. నాకు ఇమ్మని అడగను. కానీ మా అమ్మా నాన్నల ఆస్తికి నేనే వారసురాలినని గుర్తుంచుకో. అందుచేత...ఇప్పుడేమంటావ్?"

"నువ్వు ఎన్ని చెప్పినా నా నిర్ణయం మారదు."

"పోనీ మరెవరి నన్నా ప్రేమించావా?"

"లేదు."

"ఇదిగో రామారావ్. నాకు కోపం వస్తే నేనేం చేస్తానో నాకే తెలియదు. నేను మంచిదాన్ని కాదనలే. ఎవరినీ ప్రేమించని వాడివి నన్ను ప్రేమిస్తేనేం? పోనీ పెళ్ళి చేసుకుంటే నేం? నేను నీ ఆస్తికి ఆశపడి పెళ్ళి చేసుకోమని అడుగుతున్నా ననుకున్నావా? నువ్వొట్టి బికారివి. నేను ధనవంతురాలిని. నీ కంటే గొప్ప అందగత్తెను. ఇక ఏమిటి నీ అబ్జెక్షన్? ఏదో బీదవాడివి. నిన్ను చేసుకుని, సంఘాన్ని ఉద్ధరిద్దామని నేను అనుకుంటే నువ్వు నీలుగుతావేమిటి? నిన్ను అన్ని విధాలా సుఖపెడతానని ప్రామిస్ చేస్తున్నాగా?" ఆమె అతని బుగ్గల్ని పట్టుకుని బుజ్జగింపుగా అంది.

కానీ ఆమె చేయి సరిగ్గా అతని బుగ్గ మీద నున్న గంటు మీద పడటంతో అతని ప్రాణం జివ్వుమంది. ఆమె చేతుల్ని విదిలించి కొట్టాడు.

"ఎన్ని చెప్పినా నువ్వు నన్ను ప్రేమించవు. ప్రేమించలేవు. నేను నిన్ను పెళ్ళి చేసుకోను. నన్ను ప్రశాంతంగా గడ్డం గీసుకోనివ్వు."

"ఛీ. నాకన్నా నా మాటల కన్నా నీకు గడ్డం గీసుకోవటం ముఖ్యమయిందా? ఏం మనిషివి? సరే. నన్ను తిరస్కరించావు కదూ? కానీ నిన్నింతటితో వదలనని గుర్తుంచుకో."

"వదలక ఏం చేస్తావ్?"

"చూస్తావుగా—ఏం చేస్తానో?"

సుబ్బలక్ష్మి ప్రతిన చేస్తున్నట్లు అద్దాన్ని నేల కేసి విసిరి కొట్టింది. రేజర్‌ను కిటికీలోగుండా విసిరి కొట్టింది. బుసలు కొట్టే త్రాచుపాములా విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళగానే తలుపులు 'లబో దిబో' మని మొత్తుకున్నాయి.

ఆమె ఎక్కగానే కారు గుర్రుమని మొరిగింది!

● ● ●

ద్రౌపదిచే అవమానించబడిన సుయోధనుడిలా సుబ్బలక్ష్మి తన గదిలో ఏకాంతంగా చిందులు తొక్కుతూంది.

ఎయిర్‌కూలర్ ఆన్ చేసి ఉన్నా ఆమె శరీరం పంచాగ్ని మధ్యంలో ఉన్నట్లు మండుతూంది. నిలువ లేక సోఫాలో కూర్చుంది. సోఫాలో మెషిన్ గన్‌లు పేలుతున్నట్లు చివుక్కున లేచి ఫోమ్ బెడ్ మీద పడింది. తాపంతో బెడ్ పైన అటూ ఇటూ కాస్సేపు పొర్లింది. పరాభవాగ్ని చురకత్తులై పొడిచింది. శరతల్పం పై భీష్మాచార్యులు పాపం అన్నాళ్ళు ఎలా పడుకున్నాడో కానీ, సుబ్బలక్ష్మి మెత్తటి ఆ బెడ్ మీద పడుకోలేనట్లు చివ్వున లేచింది. స్టీరియో ఆన్ చేసింది.

23—6—82

పాశ్చాత్య సంగీతం ఆమె మనసు కన్నా గంద్రగోళంగా వినిపించ సాగింది. ఆ శబ్దాలలో లయకు అనుగుణంగా ఆమె స్టెప్స్ వేయసాగింది. అలా స్టెప్స్ వేస్తూనే ఆమె ఫ్రిజ్ తెరిచి ఒక బాటిల్ తీసింది. అందులో ద్రవాన్ని కాస్త గ్లాసులోకి పోసుకుని తాగింది. కాక్‌టైల్ తాగినంత థ్రిల్.

అలా కాస్సేపు స్టెప్స్ వేశాక ఆమె అలిసి పోయింది. అప్పి చల్లారినట్లనిపించింది. అప్పుడు ఆమెకు ఒంటిమీద నున్న బట్టలే బరువయ్యాయి. బట్టలు విప్పేసి నైట్‌గౌన్ వేసుకుని బెడ్ మీద వాలింది.

సుబ్బలక్ష్మి శ్రీమంతుల బిడ్డ.

శ్రీమంతులకి పాశ్చాత్యుల అలవాట్లని, సంప్రదాయాలని అనుసరించటం సరదా. అది స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. సుబ్బలక్ష్మి తల్లి తండ్రులూ ఆ కోవకు చెందిన వారే.

కాన్వెంట్ చదువుతోపాటు సుబ్బలక్ష్మికి చిన్నతనం నుంచీ ఆర్థిక స్వేచ్ఛ ఉండేది. సామాజిక కట్టుబాట్లుకూడా ఆమెకు తెలియవు.

ఆమె చిన్నతనం నుంచి ఇంగ్లీషు సినిమాలే చూచేది. అందులో సంభాషణలు అర్థం కాకపోయినా ఆ సినిమాల లోని కొన్ని దృశ్యాలు ఆమె మనసులో చిన్నతనంలోనే హత్తుకు పోయాయి. కాస్త పెద్దయ్యాక హిందీ, తెలుగు సినిమాలతోపాటు తెలుగు నవలలుకూడా చదవసాగింది.

ఫలితంగా ఆమెకు విశ్వమంతా సెక్స్ మయమైనట్లు విశ్వాసం ప్రబలి పోయింది. ఏదో సాహసం చేయాలన్న స్పిరిట్ ఆవహించింది. కొత్త కొత్త వూహాలు...ఆలోచనలు...

కానీ ఏం సాహసం చేసేటట్లు? ప్రమాదం లేని సాహసంగా ఉండాలి కదా?

ఒక శుభ ముహూర్తాన ఒక తెలుగు నవల ఆమెకు ఒక సాహస మార్గాన్ని చూపింది.


ఆ నవలలో హీరో ధనవంతుడు. అందగాడు. ప్రపంచంలో ఎక్కడా స్త్రీలే దొరకనట్లు రైలు స్టేషనులో స్త్రీల ఫస్టుక్లాస్ వెయిటింగ్ రూమ్‌లో బాత్‌రూమ్ దగ్గర ఒక అమ్మాయిని చూచి ప్రేమిస్తాడు. ఆ అమ్మాయికూడా ఇతడిని ప్రేమిస్తుంది. కానీ ఆత్మాభిమానాలు, అహంకారాలు పెళ్ళికి కొంత కాలం అడ్డం వస్తాయి. మూగ ప్రేమతో, వేదనతో ఇద్దరూ అయిదొందల పేజీలు నలిగి నలిగి చివరికి పెళ్ళి చేసుకుంటారు.

సుబ్బలక్ష్మి నవలలో పాత్రల్ని ఉల్టా సీదా చేసి వూహించుకుంది. నవలలో హీరోలో తనని ప్రొజెక్ట్ చేసుకుంది. నవలలో హీరోయిన్ లాంటి హీరో కోసం అన్వేషణ ఆరంభించింది. రైలు స్టేషన్‌లు, బస్ స్టేషనులు, సినిమా హాళ్ళు, దేవాలయాలు, సందులు గొందులు, ఆఖరికి పోలీస్ స్టేషన్లతోసహా కారు వేసుకుని వెళ్ళి మరీ గాలించింది. అలా వెతికి వెతికి వేసారి నిరాశలో మునిగి పోదామనుకుంటూండగా రామారావు ఆమె కంటబడ్డాడు.

అదీ ఎలా? గది కోసం అన్వేషిస్తూ...

అయిదు నిమిషాలు మాట్లాడగానే అతను పట్టి వెర్రిపుల్లాయని గ్రహించిం దామె. పైగా బీదవాడు.

ధనవంతులకి బీదవాళ్ళు లొంగి పడి ఉంటారని,




అమాయకులు తెలివిగల వాళ్ళు ఆడించినట్లల్లా ఆడక తప్పదనీ ఆమెకు తెలిసిన ఒక సిద్ధాంతం ఉంది. దాని ప్రకారం అతను తనకు లొంగినట్లే భావించుకుంది. దానికి తోడు అతను ఆమె చూపిన మొదటి 'ఎర' కే లొంగిపోయాడు.

"గదిని అద్దె కిచ్చుకోవలసిన అవసరం మాక్కు లేదు కదా? కానీ మిమ్మల్ని చూస్తుంటే పాపం! జాలేస్తున్నది. మా అమ్మా నాన్నలతో మాట్లాడి రేపు చెబుతాను. వస్తారుగా?"

మరునాడు అతను వచ్చేలోగా అతను చదివే కాలేజీకి ఫోను చేసి అతని వివరాలు సేకరించింది.

రామారావు 'జీనియస్'. చాలా 'మంచి' వాడు. బుద్ధిమంతుడు.

మరునాడు లంకంత కాంపౌండ్‌లో, రాజభవన్‌లా ఉన్న మెయిన్ బిల్డింగుకు అల్లంత దూరంగా ఉన్న ఔట్‌హౌస్ లాంటి మినీ బిల్డింగ్‌లోకి రామారావు గృహప్రవేశం చేయటంతో సినిమా సెట్టింగూ, సిచ్యుయేషన్ తయారయింది.

కానీ ఎన్ని రోజులు గడిచినా నవలలో హీరోయిన్‌లా తన హీరో రెస్పాండ్ కాడేం?

రామారావు అందగాడే. కానీ ఆ అందం కాదుగా సుబ్బలక్ష్మిని ఆకర్షించింది. ఏదో సాహసం చేయ్యాలన్న కోరిక—అతని బీదరికం, అమాయకత్వం కదా?

అందుచేత అతని బీదరికం పట్ల అవకాశం ఉన్నప్పుడల్లా సానుభూతి చూపించేది. తన తెలివితేటల్ని, ధన గర్వాన్ని ప్రదర్శించేది. అతని కోసం తను ఎంతో 'త్యాగం' చేసినట్లు పోజు పెట్టేది.

"రామారావ్! సెక్స్‌ను గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"పశుపక్ష్యాదుల నుంచి ప్రతి జీవికీ సహజసిద్ధమైన క్రియ అండీ అది. దాన్ని గురించి ఆలోచించటానికి, ప్రత్యేకించి అభిప్రాయాలు ఏర్పరుచుకోవటానికి ఏముంది? అయినా నా కంత తీరిక లేదు కదండీ?"

"అవున్లే పాపం. బీదవాడివి. కాలేజీ ఫీజు కోసం అద్దె గదుల కోసం, తిండి కోసం తాపత్రయ పడటంతోనే సరిపోతుందే నీకు. సెక్స్‌ను గురించి ఏం ఆలోచిస్తావ్ పాపం?"

అతను తన అభిరుచులకు భిన్నమైన తత్త్వం కలవాడని తెలిసినా, అతడిని తనమార్గంలోకి తిప్పుకుని అతడిని 'ఉద్ధరించ' దలిచిం దామె. తన వెంట తీసుకెళ్ళి సెక్స్ సినిమాలు, క్రైమ్ థ్రిల్లర్స్ చూపించాలని ప్రయత్నించింది. కానీ అతను ఉత్సాహం చూపితేనా?

ఈలోగా సుబ్బలక్ష్మికి పెళ్ళి అవసరం ఉందని గ్రహించారు తల్లితండ్రులు. ఆ ప్రయత్నంలో పడ్డారు. ఒకరిద్దరు ప్రాస్పెక్టివ్ గ్రూమ్స్‌ని పరిచయం చేశారుకూడా.

ఆ ఇద్దరూ ఆమెకు నచ్చారు—వారు ధనవంతులు కావటం చేత.

కానీ వాళ్ళను చేసుకోవటంలో సాహసం థ్రిల్ ఏముంది?

"రామారావ్! నేను నిన్ను ప్రేమిస్తున్నానంటే నువ్వేలా ఫీల్ అవుతావు?"

ఆమె తన ప్రపోజల్ వినగానే అతను ఎగిరి గంతేస్తాడనుకుంది. కానీ రామారావు మెల్లగా నవ్వి తాపీగా అన్నాడు:

"దటీజ్ వన్ ఆవ్ ది లిటిల్ వండర్స్ ఇన్ ది వరల్డ్ అనుకుంటాను."

"వ్వాట్! నిన్ను పెళ్ళి చేసుకోవటానికి నిర్ణయించుకున్నాననికూడా చెబితే?"

అతను ఎంతకీ మాట్లాడలేదు.

"ఏం? సంతోషంతో నోట్లో నుంచి మాట రావటం లేదా?"

"కాదు. కన్నీళ్ళన్నీ గొంతుకు అడ్డం పడ్డాయి."

"వ్వాట్ డూ యూ మీన్?"

"నన్ను ఆ పరమేశ్వరుడే రక్షించు గాక!"

మొదట్లో రామారావు ఆ మాటల్ని సరదాగా అంటున్నా డనుకుంది. క్షమించింది. కానీ అతను నిజంగానే తన ప్రపోజల్‌ని కాదంటున్నాడని తెలుసుకొన్నాక ఆమెకు తల కొట్టేసినట్లయింది. పట్టుదల పెరిగింది.

అయితే అహంభావం మాత్రం సడలలేదు. తనేదో సాహసం చేసి అతడిని ఉద్ధరిస్తున్నానన్న కాంప్లెక్స్‌ను వదులుకోలేదు.

అతడిని లొంగ తీసుకోవటానికి ఎన్నో ప్రయ

త్నాలు చేసింది. ఆ ప్రయత్నాలలో చివరి ఘట్టమే మొదట వర్ణించిన సంఘటన!

'ఇప్పు డిక ఏం చేయాలి? రామారావును ఎలా సాధించాలి? ఎలా అతడిని లొంగ దీసి అతనిపై విజయాన్ని సాధించాలి?'

ఆలోచనలతో సుబ్బలక్ష్మికి నిద్ర పట్టలేదు. అంతక్రితం ఎప్పుడో చదువుతూ చదువుతూ మధ్యలో టీపాయ్ మీద వదిలేసిన ఇంగ్లీషు నవలను తీసుకుంది. అంతవరకు చదివిన కథ గుర్తుకొచ్చింది.

ఆ నవలలో హీరోయిన్‌ను ఒక సందర్భంలో ఒక పురుషుడు 'రేప్' చేస్తాడు. ఆ తరవాత అతను ఆ వూరు నుంచి అంతర్ధాన మయిపోతాడు. హిరోయిన్ అతని పట్ల కచ్చబూనింది. ప్రతీకార భావంతో అతడిని అన్వేషిస్తూ తిరిగి తిరిగి ఒక చిన్న హోటల్‌లో అతడిని చూచింది.

ఆ తరవాత అతనిపై ప్రతీకారాన్ని ఆమె ఏ రకంగా తీర్చుకుంది?

ఆమె ఆ నవలను చదవ నారంభించింది. కాలం తెలియలేదు. పరిసరాలు గుర్తు లేదు. తనని తనే మరిచిపోయేటంత ఉత్కంఠ! నవలలోని హీరోయిన్‌తో తనని 'ఐడెంటిఫై' చేసుకుని ఆ పాత్రలో లీనమయింది.




ఆ స్థితిలో తనని నిరాకరించిన రామారావు పైన ప్రతీకారం తీర్చుకోటానికి ఆమె కో కొత్త రకం ఆలోచన వచ్చింది.

ఇంతవరకు ఏ స్త్రీ, ఏ పురుషుడు చెయ్యని విధంగా...

సుబ్బలక్ష్మి మనసు ఎడ్వెంచరస్ స్పిరిట్‌తో కాస్సేపు ఎగిరెగిరి ఆనందంతో వోలలాడి మత్తుగా, హాయిగా కళ్ళు మూసుకుంది.

ఆ సమయంలో కోళ్ళు ఎక్కడో అరుస్తున్నా, సుబ్బలక్ష్మికి వినిపించే అవకాశం లేదు కదా?

* * * *

సాయంకాలం ఆరు గంటలు.

రామారావు కాలేజీనుంచి అప్పుడే వచ్చి బాత్ రూమ్‌లోకి దూరాడు. అతని శరీరం అలిసిపోయింది. కానీ మనసు మహా ఉల్లాసంగా ఉంది.

అందుకు కారణం—అతనికా రోజు తండ్రి నుంచి ఉత్తరం వచ్చింది. వాళ్ళు అతనికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. పెళ్ళి చూపులకి ముహూర్తం నిర్ణయించి రమ్మని రాశారు. ఆ అమ్మాయి ఫోటోను పంపారు. ఫోటోలో అమ్మాయి రామారావుకు అమితంగా నచ్చింది. 'ఫేస్ ఈజ్ ది ఇన్‌డెక్స్' అని అనుకుంటే, ఆ అమ్మాయి గుణవంతురాలుగానే కనిపించింది.

తలుపు తట్టిన శబ్దం.

అరగంట స్నానంతో శరీరానికి అలుపు తీరింది. మనసు ఉల్లాసంగా ఉంది.

"ఎవరూ? వస్తున్నా. జస్ట్ ఎ మినిట్."

టర్కీటవల్‌తో తల, ఒళ్ళు తుడుచుకుని, ఆ టవల్‌నే నడుముకు బిగించి హుషారుగా ఈల వేసుకుంటూ వెళ్ళి తలుపు తెరిచాడు.

తలుపు అవతల సుబ్బలక్ష్మి!

ఆమెను చూడగానే అతనికి సిగ్గు ముంచుకొచ్చింది.

'ఛీ,ఛీ... ఆడపిల్ల ముందు టవల్ చుట్టుకుని అర్ధనగ్నంగా తను?'

సుబ్బలక్ష్మికూడా తనని చూచి సిగ్గు పడుతుం దనుకున్నాడు. కానీ ఆమె సిగ్గుపడలేదు సరికదా, ఒక నవ్వు విసిరింది. విసురుతూ లోపలికి వచ్చింది—వచ్చి తలుపు గడియ పెట్టింది.

"అదేమిటి? తలుపు వేస్తా వెందుకు?"

ఆమె విలన్‌లా నవ్వింది.

"ఎందుకా? పెళ్ళి చేసుకోనన్నావుగా నన్ను?"

"అవును. అంటే? మా వాళ్ళు నాకు సంబంధం చూచారు. వచ్చే వారం పెళ్ళి చూపులకి పోతున్నా."

"వూం. పెళ్ళి చేసుకుంటావేం? పెళ్ళి? నన్ను కాదని దాన్నెవతెనో పెళ్ళి చేసుకోవ డానికి ఎన్ని గుండెలు? ఎలా చేసుకుంటావో నే చూస్తాగా?"

సుబ్బలక్ష్మి విలన్‌లా నవ్వుతూ మీసాలు మెలి తిప్పబోయి, మొహం మీద పడ్డ ముంగురులను మెలి తిప్పింది. కనుబొమలను ముడిచింది. ఒక కంటిని ఎగరేసింది.

"ఏమిటే వేషాలు? నీకేమన్నా పిచ్చెక్కిందా?"

"పిచ్చా! ? అహ్హాహ్హా! నా క్కాదు, మిస్టర్ రామ్రావ్. నీకు పిచ్చి పట్టబోతూంది. చూడు నిన్నేం చేస్తానో" అంటూ ఆమె చటుక్కున ముందుకు దూకి అతన్ని గట్టిగా కావలించుకుంది.

హఠాత్తుగా జరిగిన ఆ చర్యకు రామారావు ఖంగు తిన్నాడు. కంగారు పడ్డాడు. పిచ్చిగా అరిచాడు.

"నువ్వు ఎంత అరిచి గింజుకున్నా ఇక్కడ నీ మొర వినే వారెవ్వరూ లేరు. మర్యాదగా నాకు లొంగిపో లేదా..."

ఆమె అతని మీది మీదికి రాసాగింది.

రామారావు అటూ, ఇటూ చూచాడు. ఎక్కడా గుడ్డ పేలిక కనిపించ లేదు. అతను లోపలి గదిలోకి పరుగెత్తాడు. అతని వెంట సుబ్బలక్ష్మికూడా పరుగెత్తింది.

మంచం మీద బెడ్‌షీట్‌ను తీసుకుని శరీరం నిండా కప్పుకున్నాడు రామారావు.

"అలనాడు ద్రౌపదిని దుర్యోధన దుశ్శాసనులు వలువలు ఒలిచి మానభంగం చేశారట. ఈ నాడు పురుషుడి నైన నిన్ను స్త్రీ అయిన ఈ సుబ్బలక్ష్మి వస్త్రాపహరణంతో వదులుతుం దనుకుంటున్నావేమో! ఊహూం. వదలదు గాక వదలదు" అంటూ బెడ్‌షీట్ అమాంతం లాక్కుంది. లాక్కుంటూనే రామారావును నెట్టింది.

రామారావు మంచం మీద పడ్డాడు. గదిలో లైటు ఎలా ఆరిపోయిందో ఆరిపోయింది.

"చూచుకో. ఇప్పుడు నిన్నేం చేస్తానో" అంటూ వికటంగా నవ్వుతూ మీది మీది కొస్తున్న సుబ్బలక్ష్మి నల్లటి ఆ చీకటిలో రామారావు కళ్ళకి భూత పిశాచాల సోదరిలా కనిపించింది.

"నన్నేం చేస్తావ్?"

"ఏం చేస్తానా? అహ్హాహ్హా!" ఆ తరవాత ఆమె అన్న మాట రామారావుకు వినిపించింది. భయంతో కెవ్వున కేక వేశాడు రామారావ్. అతనికి స్పృహ తప్పిపోయింది.

• • •

"సుబ్బలక్ష్మి! బుద్ధి గడ్డి తిని నిన్ను తిరస్కరించాను. నా కిప్పుడు బుద్ధి వచ్చింది. నీ గొప్పతనం తెలిసింది. జరిగిందేదో జరిగిపోయింది. నా కిప్పుడు నువ్వే గతి. నువ్వే తోడు. నువ్వే నీడ. నువ్వే నా సర్వస్వం. నన్ను పెళ్ళి చేసుకుని నా పరువు నిలుపు."

"పెళ్ళి! హ్హాహ్హాహ్హా! నన్ను ఒకసారి నిరాకరించిన పురుషుడిని నేను పెళ్ళి చేసుకోవటమా? నెవ్వర్! ఆ మాన్ని తప్ప మరే వరాన్నన్నా కోరుకో. ఇస్తాను. డబ్బు కావాలా? కాక నిన్ను 'ఉంచు'కుని పోషించ మంటావా?"

"సుబ్బలక్ష్మి!"

"హుష్. అరవకు. అపహాయుల అరుపుకు రూపాయి కున్న పాటి విలువైనా లే●. ఎంత అరచినా, ఎన్ని కన్నీళ్ళు కార్చినా నిన్ను పెళ్ళి చేసుకోవటం జరగదు. ఎవరితో చెప్పుకుంటావో, ఏం చేసుకుంటావో చేసుకో పో."

"లోకంలో ధర్మం, న్యాయం లేదా? నాకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో వారికే చెప్పు

ఉంటాను. న్యాయాన్ని పొందుతాను.''

"న్యాయం. హ్హాహ్హాహ్హా!''

● ● ●

కోర్టు హాలు కిటకిట లాడుతూంది. ఆ రోజు ఇవ్వబోయే ఒక అతి ముఖ్యమైన జడ్జిమెంట్ కోసం నిరీక్షిస్తున్నారు జనం.

ఫిర్యాది రామారావు సిగ్గుతో ముడుచుకు పోయి భయం భయంగా ఒక మూల కూర్చున్నాడు. ప్రతివాది సుబ్బులక్ష్మి పురుషులందరినీ పురుగుల్లా చూస్తూ ఠీవిగా వచ్చి ముందు వరసలో కూర్చుంది.

జడ్జిగారు వచ్చారు. జడ్జిమెంట్ చదివి వినిపించారు.

"వాది రామారావు ప్రతివాది సుబ్బులక్ష్మి పైన చిత్రాతిచిత్రమైన ఆరోపణలు చేశాడు. సాక్ష్యాధారాలను, శరీర నిర్మాణ, మనస్తత్వ శాస్త్ర ఎక్స్‌పర్ట్స ఒపీనియన్స్‌తో కలిపి క్షుణ్ణంగా పరిశీలించిన మీదట అతని ఆరోపణలు నిరాధారమైనవే కాక, చాలా అసహజమైనవిగా భావిస్తూ ఈ కేసు కొట్టి వేయటమైనది.''

● ● ● ●

"హి...హిప్... హుర్రే.''

సుబ్బులక్ష్మి నిద్రలోనే ఆనందంగా అరిచి కళ్ళు తెరిచింది.

"రాత్రి పడుకున్నావు. మళ్ళీ రాత్రి కాబోతూంది. లేమ్మా.''

సుబ్బులక్ష్మి లేచి స్నానం చేసి టాయిలెట్ అయింది. ఎడ్వంచరస్ స్పిరిట్‌తో ఆమె మనసు, శరీరం హుషారుగా ఉన్నాయి. భోజనం చేసి రామారావు రూముకు బయలుదేరింది.

అప్పుడు ఎనిమిది గంటలు కావస్తూంది. రామారావు లుంగీ చుట్టుకుని మంచం మీద పడుకుని చదువుకుంటున్నాడు. తలుపు తట్టిన శబ్దం వినిపించి బనీను వేసుకుంటూ వెళ్ళి తలుపు తెరిచాడు.

సుబ్బులక్ష్మి హుషారుగా ఈల వేసుకుంటూ లోపలికి ప్రవేశించి తలుపు గడియ వేసింది. రామారావు ఆమె చర్యల్ని గమనించీ గమనించనట్లే తాపీగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

"మిస్టర్ రామారావ్! ఇంత రాత్రప్పుడు నేను నీ గదిలోకి వచ్చి తలుపు గడియ పెడుతుంటే నీకు భయం వెయ్యటంలా?''

"భయం ఎందుకు?''

"ఎందుకా? హ్హాహ్హాహ్హా! అసలు నే నెందుకు ఇప్పుడు వచ్చానో తెలిస్తే అంత అమాయకంగా ఆ ప్రశ్న అడగవు.''

"పెళ్ళి చేసుకోమని పోట్లాడటానికి వచ్చి ఉంటావు—ఇందులో కొత్తేముంది?''

"నో!'' ఆమె బిగ్గరగా అరిచింది. "నేను నిన్ను పెళ్ళి చేసుకోను. బట్...''

"బట్? ఏం చేస్తావ్?''

● ● ● ●

"ఏం చేస్తానా? చూస్తావుగా? ఐ విల్ రేప్ యూ...'' అలా అంటూ ఆమె వెళ్ళి హఠాత్తుగా అతని బనీన్ని నర్రున చించివేసింది. అతని మొలగుడ్డ ఆమె చేతిలో ఉంది. అయినా రామారావు ప్రశాంతంగా నిలబడి ఉన్నాడు.

కండలు తిరిగిన ఒళ్ళు! విశాలమైన వక్షఃస్థలం. సుబ్బులక్ష్మి మనసు నిజంగానే చలించింది. నిగ్రహంతో బుద్ధుడిలా శాంతంగా నిలబడి ఉన్న అతడిని చూస్తుంటే ఏదో భయం—ఆరాధనాభావం!


"అయితే పెద్ద ప్రణాళికతోనే వచ్చావన్న మాట! గుడ్! ఆలస్య మెందుకు? కానియ్!'' ముందుకు వంగి అన్నా డతను.

అత నలా అన్నాక ఆమెకు ఏం చేయాలో తోచలేదు. అంత నిగ్రహంతో నిశ్చల చిత్తంతో ఉన్న పురుషుడిని ఎలా రేప్ చేయడం? అసలు ఒక స్త్రీ పురుషుడిని రేప్ చేయటం సాధ్యమా?

సూర్యరశ్మి తగిలిన మంచులా ఆమె ఎడ్వంచరస్ స్పిరిట్ కరిగి నీరు కాసాగింది. శరీరాన్ని నీరసం ఆవహించింది. కళ్ళలో వేడినీళ్ళ స్ప్రింగులు సృష్టి అయ్యాయి.

"ఏం? అలా నిలబడి పోయావ్? కానియ్.'' అతను చొక్కా విసిరి పారేసి ఆమె దగ్గరి కొచ్చి భుజాలు పట్టుకుని కుదుపుతూ అన్నాడు.

ఆతను! ఏ మా పురుష సౌందర్యం!




ఆ స్థితిలో అతడిని చూడగానే ఆమెకు సిగ్గు ముంచుకు వచ్చి తల వంచుకుంది. క్షణకాలం అంతకు ముందు ఎన్నడూ పొందని ఏదో దివ్యానుభూతి! అంత లోనే ఏదో కాంక్ష...ఉద్వేగం...

"నన్ను క్షమించు రామారావ్. ఐ లౌ యూ. రియల్లీ ఐ లౌ యూ. నువ్వు నన్ను కాదంటే నేను చచ్చిపోతాను.'' అమాంతం అతడిని కౌగిలించుకుని అతని గుండెలో మొహం పెట్టి వెక్కి వెక్కి ఏడవసాగిం దామె.

రామారావు నవ్వుతూ సుకుమారంగా ఆమెను వదిలించుకున్నాడు.

"సుబ్బులక్ష్మి! ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా స్త్రీ ఎంత గొప్పదన్నా కానియ్, శారీరకంగా పురుషుడిని రేప్ చెయ్యలేదు. అయితే నీ లాంటి బలహీనమైన స్త్రీలు సమాజం పేరిటో సమానత్వం పేరిటో మానసికంగా పురుషుడిని ఎప్పుడూ రేప్ చేస్తూనే ఉంటారు. పురుషుడిని రేప్ చెయ్యాలన్న భావన సమానత్వానికి, సాహసానికి చిహ్నం కాదు సుబ్బులక్ష్మి. ఫూలిష్‌నెస్! శరీర నిర్మాణం, మనోధర్మ శాస్త్రం తెలియని అజ్ఞత అది. మెన్ కెనాట్ బి రేప్డ్. గెటవుట్.'' రామారావు తలుపు తెరిచి పట్టుకుని ప్రశాంతంగా అన్నాడు.

ఆమె మెల్లగా నడిచి తలుపు దాకా వచ్చి అతడి కాళ్ళ వద్ద కూలబడిపోయింది.

"ఏమండీ! నా అహంకారం చచ్చిపోయింది. గర్వం అంతరించింది. భ్రమలు మాయమయ్యాయి. నే నిప్పుడు మిమ్మల్ని మీ ధీరత్వాన్ని మీ నిగ్రహాన్ని మనోనిశ్చలత్వాన్ని, నీతిని, ధర్మాన్ని—అన్నిటినీ ప్రేమిస్తున్నాను. మీకు సహధర్మచారిణి నయ్యే అదృష్టాన్ని నాకు ప్రసాదించరూ? ప్లీజ్.''

గుమ్మానికి ఇటు వైపు అతను...

అటు వైపు ఆమె...

తలుపు మూసినా, తెరిచినా అతని ఇష్టం.

కానీ నిజంగా పశ్చాత్తాపం చెందిన హృదయం ఆమెది. క్షోభ పెడితే కాలిపోతుంది. ఆదరిస్తే మంచి పెరుగుతుంది.

అతను మెల్లగా ఆమె వద్దకు వచ్చాడు.

"అయితే పద. జరిగిందంతా మీ అమ్మా నాన్నలతో చెప్పు. ఆ తరవాత వాళ్ళతో నేను మాట్లాడుతాను. కానీ సుబ్బులక్ష్మి మళ్ళీ ఆలోచించు. స్త్రీ పురుషుల్లో ఎవరికైనా కానీయ్ నిజమైన బలంధనం కాదు నిగ్రహశక్తి. శారీరక బలహీనత బలహీనత కాదు. మనిషి అసలు బలహీనత అహంకారం ఇంద్రియ లోలత్వం. మనిషికి అసలైన అందాన్నిచ్చేది ఆభరణాలు వెర్రి మొర్రి సాహసాలు కాదు. శాంతిసహనాలు సంయమనదృష్టి, ధార్మిక నిష్ఠ ఏ మానవుడికైనా నిజమైన అలంకరణలు. నా ఈ భావాలతో నువ్వు మనఃస్ఫూర్తిగా అంగీకరిస్తే నా వెంట నడిచి రా.''

అతను వాకిలి దాటి బయటి కొచ్చాడు.

ఆమె హుషారుగా లేచి అతని వెంట నడవసాగింది.

★